ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎండీ హుస్సేన్

ఎమ్మెల్సీ కవితతో హుస్సేన్

కొత్తగూడెం అర్బన్, జనవరి 4 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కొత్తగూడెం మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ప్రైవేట్ కార్మికుల సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ ఎండీ హుస్సేన్ శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించారు. సింగరేణి బొగ్గు బావులు, బతుకమ్మ, దుమ్ముగూడెం ప్రతి కార్యక్రమంలో తోడుగా హుస్సేన్ ఉండేవాడని గుర్తుచేశారు. రాష్ట్ర ఏర్పాటుకు చేసిన ప్రత్యేక పోరాటాలు పార్టీ బలోపేతానికి కృషిచేసిన హుస్సేన్ అని అన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

టీవీపీఎస్ ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతి

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కొత్తగూడెం అర్బన్, జనవరి 4 : తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోస్టాఫీస్ సమీపంలో ఉన్న నూతన సంఘ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ 4వ ఏట ప్రమాదవశాత్తు రెండు కళ్లు కోల్పోయాడని, మనోధైర్యంతో అంధుల లిపిని కనుగొన్నారని అన్నారు. కార్యక్రమంలో జగ్గు దాస్, రమణయ్య, ఉపేంద్రమ్మ, మేడి ప్రవీణ్‌కుమార్, కాటి నాగేశ్వరరావు, అబ్దుల్ నయీం, సాయిబాబా రాజయ్య, రమేష్, చాంద్ పాషా, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పిస్తా.. : ఎమ్మెల్యే కూనంనేని

వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

కొత్తగూడెం అర్బన్, జనవరి 4 : అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల గురించి ఎమ్మెల్యేను శనివారం జర్నలిస్టులు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. జర్నలిస్టులకు కేటాయించిన పది ఎకరాల లాండ్‌కు పెన్సింగ్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కలెక్టర్, సీఎంతోనే మాట్లాడి త్వరితగతిన స్థలాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రభుత్వ ఆమోదం

కొత్తగూడెం అర్బన్, జనవరి 4 : కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్తగూడెం టౌన్‌లో 36 వార్డులు, పాల్వంచ టౌన్‌లో 24 వార్డులు, సుజాతనగర్‌లో ఏడు పంచాయతీలను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పాతికేళ్లుగా ఎన్నికలు జరగని పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహణకు లైన్‌క్లియర్ అయిందని, ఇక నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

పోక్సో నిందితుడు అరెస్ట్

అశ్వారావుపేట, జనవరి 4: పోక్సో కేసు నిందితుడిని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ శనివారం అరెస్ట్ చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మూడేళ్ళ చిన్నారిపై, అదే గ్రామానికి చెందిన బాలుడు(17) ఈ నెల 1న ఆటోలో గ్రామ శివారుకు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆ చిన్నారి తల్లి ఫిర్యాదుతో బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అతడిని శనివారం డీఎస్పీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సీఐ కరుణాకర్, ఎస్సైలు యయాతి రాజు, రామ్మూర్తి పాల్గొన్నారు.

పైప్‌లైన్లు పగలకుండా పనులు చేపట్టాలి

– మిషన్ భగీరథ డీఈ హరి

జూలూరుపాడు, జనవరి 4 : మిషన్ భగీరథ పథకంలో భాగంగా రోడ్డు పక్కన వేసిన పైప్‌లైన్లు పగలకుండా కల్వర్టులు, రహదారి నిర్మాణాలను చేపట్టాలని మిషన్ భగీరథ డీఈ హరి పేర్కొన్నారు. మండల కేంద్రం నుంచి పాపకొల్లు గ్రామం వరకు డబుల్ రోడ్డు మంజూరుకావడంతో కల్వర్టులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సదరు గుత్తేదారుకు పలు సూచనలు ఇచ్చారు. కల్వర్టులు, కాలువల వద్ద జాగ్రత్తగా నిర్మాణ పనులు చేపట్టాలని పొరపాటున పైప్‌లైన్ పగిలిపోతే సుమారు 15 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వీరి వెంట మిషన్ భగీరథ ఏఈ కిషోర్ ఉన్నారు.

గుట్టలను కొల్లగొడుతున్నారు..!

- **జూలూరుపాడులో జోరుగా మట్టి తోలకాలు**
- **ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారులు**

జూలూరుపాడు రైతువేదిక సమీపంలో మట్టి కోసం గుట్టను తవ్విన దృశ్యం

జూలూరుపాడు, జనవరి 4 : మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండానే మట్టిని జోరుగా తరలిస్తున్నారు. గుట్టలు, ప్రభుత్వ భూముల్లో మట్టి అక్రమ రవాణా మూడుపువ్వులు.. ఆరుకాయలన్న చందంగా సాగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో ఉన్న గుట్టమట్టిని జేసీబీలతో తోడి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా విక్రయిస్తున్నా రెవెన్యూ శాఖాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో గుట్టలు సైతం తరిగిపోతున్నాయి. వీటితోపాటు పడమటనర్సాపురం, కాకర్ల గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమి, అనంతారం, వినోభానగర్, జూలూరుపాడు, పాపకొల్లు, బేతాళపాడు గ్రామాల్లో యథేచ్ఛగా పట్టపగలే మట్టి తోలకాలు సాగిస్తున్నారు. మండలంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లు, ఇంటి నిర్మాణాలు చేపడుతున్న నిర్వాహకుల అవసరాలను అదునుగా చేసుకొని అధిక ధరలకు మట్టిని విక్రయిస్తూ గుట్టలను కొల్లగొడుతున్నారు. మట్టి తోలకాలతో భారీగా గోతులు ఏర్పడి వర్షాకాలంలో వాటిలో నీళ్లు నిండి చిన్నారులు ప్రమాదవశాత్తు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులకు కాసుల వర్షం కురుస్తోంది. సామాన్యుడు తట్టెడు మట్టి తవ్వుకోవాలంటే సవాలక్ష అనుమతుల కోసం ఆంక్షలు విధించే అధికారులు పట్టపగలే జోరుగా మట్టి తోలకాలు సాగిస్తున్నా చోద్యం చూస్తుండటం వెనుక ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి మట్టి తోలకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఇల్లెందు: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

భద్రాచలం: మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

ఇల్లెందు, జనవరి 4: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని చెప్పారు. అతి వేగంగా, అజాగ్రత్తగా, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు సందీప్, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలం, జనవరి 4: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోటమళ్ల రమ ఆధ్వర్యంలో శనివారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవం జరిగింది. రోడ్డు భద్రత నిబంధనలు, ప్రమాదాల నివారణపై ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అవగాహన కల్పించారు.

టేకులపల్లి, జనవరి 4: ట్రాఫిక్ నిబంధనలపై యువతకు ఎస్సై పోగుల సురేష్ శనివారం అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా టేకులపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేట, జనవరి 4: రోడ్డు భద్రత నిబంధనలపై స్థానిక సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనదారులకు ఎంవీఐ రాంబాబు శనివారం అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నిబంధనలను పాటిస్తామంటూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్సై వెంకట సుబ్బారావు, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌టీల సమ్మె విరమణ

భద్రాచలం, జనవరి 4: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టీ) శనివారం సమ్మె విరమించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్కతో సీఆర్‌టీల సంఘం రాష్ట్ర నాయకులు జరిపిన చర్చలు సఫలమవడంతో సమ్మెను విరమించినట్లు జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుగులోత్ రవికుమార్ తెలిపారు. ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు, ఉపాధ్యాయినులకు 180 రోజుల ప్రసూతి సెలవులు, డెత్ బెనిఫిట్స్ ఇచ్చేందుకు మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. సీఆర్‌టీల కొనసాగింపు ఫైల్‌పై ఇప్పటికే సీఎం సంతకం చేశారని, త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి తెలిపారని వెల్లడించారు. ఈ కారణంగానే సమ్మెను విరమించినట్లు చెప్పారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా నాయకులు రాజేష్, రవి, వీరన్న, భూక్యా కోటయ్య, సురేష్, సక్రు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల బడి బాట..!

దుమ్ముగూడెం:మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ మణెమ్మ

దుమ్ముగూడెం/అశ్వారావుపేట రూరల్/భద్రాచలం, జనవరి 4: ఐటీడీఏ డీడీ మణెమ్మ, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య.. శనివారం 'బడి బాట' పట్టారు..! దుమ్ముగూడెం మండలం కే రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డీడీ మణెమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన తీరును పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అశ్వారావుపేట మండలంలోని అనంతారం గ్రామంలోగల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తనిఖీ చేశారు. మెనూ అమలును, ఇంగ్లిష్ మీడియంలో బోధననున పరిశీలించారు. వసతులను విద్యార్థినుల నుంచి తెలుసుకున్నారు. భద్రాచలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ బాలికల పాఠశాలను అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్, వాష్ రూమ్ పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

వామనావతారంలో రాములోరు..


వామనావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రాద్రి రామయ్య

భద్రాచలం, జనవరి 4 : ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఐదో రోజు శనివారం స్వామివారు వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని వామనావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత నిత్య కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ పూజాధికాల అనంతరం వేదపండితులు స్వామివారికి వేద విన్నపాలు సమర్పించారు. తర్వాత మిథిలా స్టేడియానికి మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొస్తుండగా అగ్రభాగాన మహిళలు భక్తిభావంతో కోలాటాలు వేశారు. మిథిలా స్టేడియంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం వామనావతారంలో ఉన్న స్వామివారిని దర్శించుకుని భక్తులు మంత్రముగ్ధులయ్యారు.

నేడు పరశురామావతారం..

ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఆదివారం భద్రాచలం సీతారామచంద్రస్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పీహెచ్‌సీ, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల తనిఖీ

దుమ్ముగూడెం, జనవరి 4: మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం పీహెచ్‌సీలతోపాటు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులు, డ్రగ్ స్టోర్ రూం, వ్యాక్సిన్ భద్రపరిచే ఐఎల్ఆర్ గదులను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, డీఎంహెచ్‌వో సీసీ పాయం శ్రీను, వైద్యులు పుల్లారెడ్డి, రుక్మాకర్, రేణుక పాల్గొన్నారు.

బొజ్జిగుప్ప సందర్శించిన కలెక్టర్

బొజ్జిగుప్ప గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్

దుమ్ముగూడెం, జనవరి 4: ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ దేశాలకు తెలిపేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, మండలంలోని గిరిజన గ్రామమైన బొజ్జిగుప్పను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కలిసి శనివారం సందర్శించారు. అక్కడి గిరిజనులతో మాట్లాడారు. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న హైదరాబాద్ నుంచి ఓ బృందం బొజ్జిగుప్ప సందర్శిస్తుందని చెప్పారు. డీఆర్‌డీవో విద్యాచందన, తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అరోరా క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

పాల్వంచ, జనవరి 4 : జిల్లాలోని పాల్వంచ పట్టణంలో ఉన్న అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ వేణు గోపాల్ ఆవిష్కరించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల చైర్మన్ తాళ్లూరి హరిబాబు, చిరుత మహేష్, చింతల లక్ష్మణ్ పాల్గొన్నారు.

చివరి భూములకు నీరివ్వాలని వినతి

బూర్గంపహాడ్, జనవరి 4: మండలంలోని మోరంపల్లిబంజర్‌లో శ్రీవేంకటేశ్వర ఎత్తిపోతల పథకం–4 కింద చివరి ఆయకట్టు భూములకు నీరు ఇవ్వాలని కోరుతూ రైతులు శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. మండల పర్యటనకు వచ్చిన ఆయనను రైతులు కలిసి, సమస్యను వివరించారు. ఆ లిఫ్ట్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. చివరి ఆయకట్టు రైతుల పొలాలకు నీరు అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా జయంతిని అధికారికంగా నిర్వహించాలి

రామవరం, జనవరి 4 : ఆధునిక భారతదేశ మొట్టమొదటి ముస్లిం మహిళా విద్యావేత్త ఫాతిమా షేక్ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ గురుకులాలతోపాటు ఉర్దూ మీడియం విద్యాసంస్థల్లో అధికారికంగా నిర్వహించాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సావిత్రిబాయి పూలేతో కలిసి అణగారినవర్గాల మహిళలు, పిల్లలకు అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన ఫాతిమా జయంతిని జనవరి 9వ తేదీన అధికారికంగా నిర్వహించాలని కోరారు.

'ఆయిల్‌పాం' సాగు లక్ష్యాలను సాధించాలి

అశ్వారావుపేట, జనవరి 4: ఆయిల్‌పాం సాగు విస్తరణ లక్ష్యాలను సకాలంలో సాధించాలని అధికారులను ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉండాలని, తోటల నిర్వహణలో మార్గ నిర్దేశనం చేయాలని అన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీలను ఆయన శనివారం ఆయన సందర్శించారు. గెలల క్రషింగ్‌ను తనిఖీ చేశారు. ఫ్యాక్టరీల నిర్వహణ, సమస్యలపై ఆరా తీశారు. అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆయిల్‌పాం హబ్‌గా మారిందని అన్నారు. ఆయిల్‌పాం రైతుల సంక్షేమానికి ఆయిల్‌ఫెడ్ కట్టుబడి ఉందన్నారు. ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ తూర్పు సుధాకర్‌రెడ్డి, పీ అండ్ పీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీల మేనేజర్లు నాగబాబు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ బండిల్స్ చోరీ

పాల్వంచ, జనవరి 4 : పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం రోడ్డులో ఉన్న డీఎండీ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.25 లక్షలు ఖరీదు చేసే సిగరెట్ బండిల్స్ శనివారం తెల్లవారుజామున చోరీకి గురయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. పవన్ మనియార్ అనే వ్యక్తి డీఎండీ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఐటీసీ కంపెనీకి చెందిన సిగరెట్ ప్యాకెట్ల డిస్ట్రిబ్యూటర్ తీసుకొని నడిపిస్తున్నాడు. గుర్తుతెలియని కొందరు వ్యక్తులు శనివారం తెల్లవారుజామున గోడౌన్ షట్టర్ పగలగొట్టి అందులో ఉన్న పది సిగరెట్ కాటన్స్ రూ.25 లక్షలు ఖరీదు చేసే వాటిని ఒక వ్యాన్‌లో వేసుకొని పోయినట్లుగా తెలుస్తోంది. చోరీకి ముందుగా ఆ గోడౌన్‌కు సంబంధించిన సీసీ కెమెరాల మెయిన్ వైర్లు పూర్తిగా కట్ చేసి ఈ చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం షాపునకు వచ్చి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాల్వంచ, జనవరి 4 : కేటీపీఎస్ ఏడోదశ కర్మాగారంలో సివిల్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుడు కనిగిర ఆంజనేయులు(59) రోడ్డు ప్రమాదంలో శనివారం మృతిచెందారు. పాల్వంచలోని కేఎస్‌పీ రోడ్డులో యూటర్న్ తీసుకునేక్రమంలో కిన్నెరసాని రోడ్డు వైపు నుంచి అంబేద్కర్ సెంటర్‌కి వస్తున్న అనిల్ ద్విచక్రవాహనంతో అతివేగంగా ఎదురుగా ఢీకొనడంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న అనిల్‌తోపాటు వెనక కూర్చున్న ఉల్వనూరుకు చెందిన బదావత్ తరుణ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి మృతి

చండ్రుగొండ, జనవరి 4: ఆత్మహత్యకు యత్నించి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పోకలగూడెం పంచాయతీ బాలియతండా గ్రామానికి చెందిన లావుడియా వీరన్న పెద్ద కుమారుడు శంకు చరణ్(17), జూలూరుపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గత నెల 27న ఇంటికి వచ్చాడు. హాస్టల్‌కు తిరిగి వెళ్లేందుకు నిరాకరించాడు. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. ఇది తట్టుకోలేని ఆ బాలుడు, ఈ నెల 3న (శుక్రవారం) ఉదయం 8.00 గంటల సమయంలో ఇంటి వద్దనే పురుగుల మందు తాగి, జూలూరుపాడు వెళ్లాడు.

అక్కడ ఎస్సీ బాలుర హాస్టల్ ఎదురుగా స్పృహ తప్పి పడిపోయాడు. హాస్టల్ వార్డెన్ జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యుల సూచనతో ముందుగా కొత్తగూడెం ఆస్పత్రికి, ఆ తర్వాత ఖమ్మం మమత ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆ బాలుడు శనివారం తెల్లవారుఝామున మృతి చెందాడు. అతడి తండ్రి వీరన్న ఫిర్యాదుతో చండ్రుగొండ ఏఎస్సై పాపయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

'సింగరేణి' విద్యార్థికి అభినందన


వరుణ్ కోమల్‌ను అభినందిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు రూరల్, జనవరి 4: ఇల్లెందు సింగరేణి స్కూల్ విద్యార్థి వరుణ్ కోమల్.. జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో సత్తా చాటాడు. టీచర్ విష్ణుప్రియ మార్గనిర్దేశనంలో 'స్మార్ట్ అగ్రికల్చర్ రోబో' రూపొందించాడు. వరుణ్ కోమల్‌ను, గైడ్ టీచర్ విష్ణుప్రియను సింగరేణి ఏరియా జీఎం కృష్ణయ్య శనివారం తన కార్యాలయంలో అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ జీవీ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సారపాక విద్యార్థిని ప్రతిభ

బూర్గంపహాడ్, జనవరి 4: కొత్తగూడెంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని కింతాడ వల్లిశ్రీ అలివేణి, వందకు 83 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. డీఈవో వెంకటేశ్వరచారి నుంచి ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతిని అందుకుంది. ఆమెను హెచ్ఎం, సోషల్ టీచర్ విరజ అభినందించారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక

టేకులపల్లి, జనవరి 4: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) శనివారం టేకులపల్లిలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించింది. ఒలంపియాడ్, వక్తృత్వ పోటీల్లో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తేజస్వి, హర్షిత, నజీబా ప్రథమ స్థానం సాధించి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో జగన్, హెచ్ఎం మెరుగు శ్రీనివాస్, ఇంగ్లిష్ టీచర్స్ రవీందర్, శేషగిరి, ప్రవీణ్ అభినందించారు.

केनरा बैंक కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) सिंडिकेट Syndicate
ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ నార్త్
రికవరీ సెక్షన్, హైదరాబాద్, 1వ అంతస్తు, శాంతి థియేటర్ ఎదురుగా, నారాయణగూడ, హైదరాబాద్-500029, సెల్: 9440492936

ఇ–వేలం అమ్మకం ప్రకటన

ఇ–వేలం తేది & సమయం: 29-01-2025న ఉ. 11.30 గం. నుండి మ. 12.30 గం. వరకు
బయానా దాఖలుకు చివరి తేది: 28-01-2025న సా. 5.00 గం. వరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6), 9(1) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ–వేలం అమ్మకం ప్రకటన. సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన, కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ తెలిపిన విధంగా **కెనరా బ్యాంక్**కు బకాయిలు + దానిపై వర్తించని వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలను రాబట్టుకొనుటకు **''ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదికన''** విక్రయించబడతాయని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

రుణగ్రహీత(ల) పేరు: 1. మెసర్స్ S9 సిరీస్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న దాని డైరెక్టర్లు శ్రీ జీవన్‌కుమార్ మునిపల్లి మరియు కుమారి నందిని సిమ్హాద్రి, ఇం.నెం.6-3-865/12, గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్స్, అమీర్‌పేట్, హైదరాబాద్–500016 (రుణగ్రహీత), **2. శ్రీ జీవన్‌కుమార్ మునిపల్లి తండ్రి జీవన్ కేశవ**, 14–20–677/231, వివేకానంద నగర్, వివేకానంద విగ్రహం సమీపాన, అల్లాపూర్, బాలనగర్, హైదరాబాద్–500018 (డైరెక్టర్ మరియు హామీదారు), **3. కుమారి నందిని సిమ్హాద్రి C/O. ఎస్.కుమారస్వామి**, ఫ్లాట్ నెం.001, గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్స్, ఆర్‌బీఎల్ బ్యాంక్ లేన్, గ్రీన్‌పార్క్ హోటల్ సమీపాన, అమీర్‌పేట్, సికింద్రాబాద్, హైదరాబాద్–500016 (డైరెక్టర్ మరియు హామీదారు).

31.12.2024 నాటికి మొత్తం బకాయి రూ. 1,34,27,004/– (ఒక కోటి ముప్పై నాలుగు లక్షల ఇరవై ఏడు వేల నాలుగు రూపాయలు మాత్రమే)

ఏవేని తెలిసిన తాకట్టు రుణభారాలతో స్థిరాస్తి వివరాలు మరియు పూర్తి వివరణ:
కాంట్రాక్టర్స్ కాలనీ, పాల్వంచ మున్సిపల్ పరిధి, పాల్వంచ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం వద్ద గల, 1090 చ.అ. ఆర్‌సిసి బిల్డింగ్ ప్లింత్ ఏరియా, 266.66 చ.గజాలు విస్తీర్ణం సైట్‌లో నిర్మించబడిన కొత్త ఇం.నెం.20–5–50కి చెందిన పాత ఇం.నెం.20–15/1 కలిగిన ఆర్‌సిసి నివాస ఇల్లు, సరిహద్దులు: ఉత్తరం: 30'–00'' వెడల్పు మున్సిపల్ రోడ్, దక్షిణం: సత్యనారాయణ ఇల్లు, తూర్పు: గుర్రం శంకరయ్య ఇల్లు, పడమర: 30'–00'' వెడల్పు మున్సిపల్ రోడ్.

రిజర్వు ధర: 44,96,000/- బయానా: 4,49,600/- బిడ్ పెంపుదల: రూ. 50,000/-

* తదుపరి వివరాలకు సంప్రదించండి: కెనరా బ్యాంక్, అమీర్‌పేట్ II శాఖ, ఫోన్: 040–23416796, 23416798, మొబైల్: 9897306990
* ఆస్తిని 28.01.2025న సా.5.00 గం.లోగా అధీకృత అధికారి ముందస్తు అనుమతితో తనిఖీ చేసుకోవచ్చును.
* బ్యాంకుకు తెలిసినంతవరకు ఎలాంటి తాకట్టు రుణభారాలు లేవు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన
వేలం ఆన్‌లైన్ పోర్టల్ https://ebkray.in ద్వారా నిర్వహించబడును.
వేలం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు దర్శించండి: www.canarabank.com.
ఆస్తి విచారణ మరియు తనిఖీ కొరకు సంప్రదించండి ప్రాంతీయ కార్యాలయం: 9505056915

తేది: 31-12-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/– అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆదివాసీ గ్రామంలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఇన్నయ్య

మణుగూరు టౌన్, జనవరి 4: మణుగూరు మండలం బుగ్గ ఆదివాసీ గ్రామంలో శనివారం వైద్య శిబిరాన్ని సింగరేణి సేవాసమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం నిర్వహించాయి. 73 మందికి సింగరేణి ఏరియా ఆస్పత్రి డాక్టర్ ఇన్నయ్య వైద్య సేవలు అందించారు. డీజీఎం (పర్సనల్) రమేష్, స్టాఫ్ నర్స్ భవాని, సిబ్బంది నాగమణి, రవి, మీనా తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఈఈగా చంద్రశేఖర్

భద్రాచలం, జనవరి 4: భద్రాచలం ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈగా వై.చంద్రశేఖర్ శనివారం విధుల్లో చేరారు. హైదరాబాద్‌లోని చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో డీఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బోరు బావుల తవ్వకాలు ప్రారంభం

దమ్మపేట రూరల్, జనవరి 4: మండలంలోని పూసుకుంట, కటుకూరు గ్రామాలకు చెందిన 34 మంది గిరిజనులకు బోరు బావులు, మోటర్లు, కరెంట్ కనెక్షన్లు మంజూరయ్యాయి. తొలి విడతగా, పూసుకుంటలో 12 మందికి చెందిన బోర్ల తవ్వకాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం ప్రారంభించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట, జనవరి 4: మండలంలోని జలవాగు గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్సై సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7940, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు.

స్టడీ గైడ్లు పంపిణీ

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 4: ములకలపల్లి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు చిరాగ్ ఫౌండేషన్(యూఎస్‌ఏ) సహకారంతో స్టడీ గైడ్స్‌ను ఎస్సై పుష్పాల రామారావు శనివారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్గంపహాడ్ వైపు కరకట్ట నిర్మించాలి

బూర్గంపహాడ్, జనవరి 4: భద్రాచలం పట్టణానికి ఎదురుగా ఉన్న బూర్గంపహాడ్ వైపు కూడా కరకట్ట నిర్మించాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ పంపినట్లు భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులకు ఈ విషయం చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట, జనవరి 4: మండలంలోని జలవాగు గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్సై సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7940, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు.

చెక్కులు పంపిణీ

మణుగూరు టౌన్, జనవరి 4: మండలంలోని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులు 18 మందికి చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం మణుగూరులోని తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. తహసీల్దార్ రాఘవ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

ఇల్లెందు, జనవరి 4: గత ఏడాది అక్టోబర్ 17న ఇల్లెందు మండలం జగదాంబ గుంపు వద్ద నిట్ట సుదర్శన్‌పై దాడి జరిగింది. ఈ కేసులోని మొత్తం ఎనిమిది మంది నిందితుల్లో ఆరుగురిని ఇప్పటికే కోర్టు ఆదేశంతో రిమాండుకు పంపారు. మిగిలిన ఇద్దరిని కూడా శుక్రవారం రిమాండ్‌కు పంపారు. ఈ వివరాలను సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను స్థానిక జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీని అంధులకు అందించిన సేవలను వివరించారు. అనంతరం అంధులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బ్లైండ్ అసోసియేషన్స్ సభ్యుడు నరేందర్, బాలకృష్ణ, రమణయ్య, కిరణ్, ఉపేంద్ర, బిందు, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సఖి స్టాఫ్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616